# రాధా మురళీ మాధవం

రాధ - మురళి... ముచ్చటైన జంట. ఆకాశమంత పందిట్లో భూదేవంత పీటల మీద రంగరంగ వైభోగంగా పెళ్ళయింది. మూడు ముళ్ళు ముడిపడి ముప్పైరోజులు కాలేదింకా.... భారత సరిహద్దు, కార్గిల్ కనుమల్లో యుద్ధ జ్వాలలు చెలరేగుతాయని మిల్ట్రీ ఆఫీసర్ మురళి ఊహకందలేదు. భారతమాత సిందూరమనుకున్న కాశ్మీరాన్ని కబళించాలని దొంగనాటకమాడుతున్న పాకిస్తాన్ పటాటోపం భారత్‌కు తెలుసు. కాని అప్పుడే దొంగచాటుగా తమ సైనికుల్ని సరిహద్దులు దాటించి అంతర్జాతీయ నియమాలను తుంగలో తొక్కుతుందను కోలేదు. భారత సైనిక బలగాల్లో పౌరుషం పొంగులెత్తింది. శత్రువులను తరిమికొట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దాని ఫలితమే..... కాళ్ళ పారాణి సరిగా ఆరని మురళిని మంచుకొండల్లోని కుప్వారా సైనిక స్థావరానికి లాక్కొచ్చింది. యుద్ధక్షేత్రములో నిలబెట్టింది.

సైనిక దుస్తులు ఒంటిమీదికి రాగానే మురళి నరాల పొరల్లో రోషం పరుగులెత్తుతుంది. టైగర్‌గా అవతరించి టైగర్ హిల్స్‌ను పాక్ అధీనం నుండి తిరిగి స్వాధీనం చేసుకోవాల్సిందే. శత్రువును ఎత్తుకు పై ఎత్తుతో చిత్తు చెయ్యాల్సిందే ... పట్టుదల పౌరుషాన్ని పురికొల్పింది. హిమపర్వతాల్లోని కార్గిల్ కనుమల్లో నాల్, ద్రాస్ సబ్ సెక్టార్లో ఎముకలు కొరికే చలి. చలి పులితో సయ్యాటలాడుతూ క్షణమొక గండముగా గడపడం సరదాగా మారింది. బాంబుల మోతలు, శతఘ్నుల బెదిరింపులు .... అన్నీ మామూలే కాని... ముసిముసి నవ్వుల ముగ్ధ అర్ధాంగి రాధ మనసు తెరమీద సాక్షాత్కరించినప్పుడు అదోలాగవుతుంది.... తనను మరో లోకంలోకి లాక్కెళ్తుంది.

“మీరింత తొందరగా యుద్ధరంగానికెళ్ళడం... నాకు ఏనుగెక్కినంత గర్వంగా ఉంది. చిన్నప్పుడు రాణీ రుద్రమ, జిజియాబాయి లాంటి వీర వనితల గురించి చదివాను. దేశరక్షణలో ఉన్నారనే మీకు మనసిచ్చాను. దేహం కన్నా దేశం మిన్న గదా”..... మొదటి

రాత్రి తన డెందము నావిష్కరించిన అందాలబొమ్మ గిలిగింతలు పెడుతుంది. దాంతో కండరాలు వెయ్యేనుగుల బలాన్ని పుంజుకుని చలిపులిని వెన్నంటి తరిమేస్తాయి. మంచుకొండల్ని ఒడుపుగా దాటేప్పుడు ఊహల్లో భారత మాత మహిషాసురమర్దనిలా కనబడుతుంది. వెన్నుతట్టి ముందు కురికిస్తుంది. గుండెబలాన్ని కొండొంత పెంచేస్తుంది.

శత్రుదేశం చేతుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానముంది. చిమ్మచీకట్లో చూడగల పరికరాలు, మంచులో సజావుగా తిరిగే ఆధునిక వాహనాలు, రాకెట్ గ్రెనేడ్లు, తుపాకుల ఆచూకీ గుర్తించే రాడార్లు, స్వయంచాలిత, తుపాకులు మన వద్ద లేకున్నా ఆత్మవిశ్వాసం ఆలంబనగా 140 బోఫోర్స్ శతఘ్నులను చాకచక్యంగా ప్రయోగిస్తూ ఆపరేషన్ విజయ్‌లో భారత వీరజవానులు వీరవిహారం చేస్తున్నారు. వందేమాతరం, భారతమాతాకీ జై నినాదాలతో ఆత్మబలాన్ని రెట్టింపు చేసుకుంటున్నారు. భారత వైమానిక దాడులు శత్రువులను ఊపిరి పీల్చుకోనివ్వడం లేదు. మిగ్-21 విమానం, మిగ్-17 హెలికాప్టర్లు శత్రువుల దొంగదెబ్బలతో పడిపోతున్నా ధైర్య సాహసాలు, యుద్ధవ్యూహాలు సడలి పోలేదు.

విశ్రాంతి సమయాల్లో మంచుకొండల్లోని చంచల నయన మురళి కళ్ళ ముందు కదలాడుతుంది. ఆమె... గుడారానికెంతో దూరములో లేదు. అప్పుడప్పుడు అటువెళ్ళి ఆమెతో మాట్లాడాలని మనసు మారాము చేస్తోంది.

ఈ మధ్యనే అటు వెళ్తాంటే వాళ్ళింటి ముందు మెరుపుతీగలా కనబడింది. బొద్దుగా, ముద్దుగా ఉంది. "నీదేం పేరు?" అడిగాడు హిందీలో. కమ్మని స్వరం. "అలకానంద" తియ్యగా చెప్పింది. ముసిముసి నవ్వుల్లో అలకానంద నదీ తరంగాల మెరుపు ద్యోతకమైంది. చదువుకుంటుందంటా. తల్లిదండ్రుల్ని పాక్ మూకలు పొట్టన పెట్టుకున్నాయంది. అమ్మమ్మ - తాతయ్యలతో ఉందట. చాలా పేద కుటుంబమట. అయ్యో పాపం! విధివిలాసమంతే! ఓ రోజు రెండు ఆపిల్‌పండ్లు ఇచ్చాడు. అమ్మాయి కళ్ళు ఆనందజ్యోతులైనాయి. ఇంకో రోజు బిస్కెట్ పాకెట్... రోజూ ఏదో ఒకటి తన ఫోటో అడిగి తీసుకుంది. కలిసినప్పుడల్లా ఆ ఫోటోను గుండెలకు హత్తుకుంటూ నవ్వుతుంది. ఆ నవ్వు పున్నమి వెన్నెల ఆరబోసినట్టుంటుంది. మనసులు మాట్లాడుకున్నాయి. అల్లిబిల్లి మాటలతో ఆత్మీయత పెనవేసుకుంది.

+

"ప్రియమైన రాధా!

అగమ్యగోచరమైన జీవనయానానికో పరమార్థముండాలని సైన్యములో చేరానుగదా! ప్రస్తుతం కార్గిల్ లోయల - పర్వతాల సబ్‌సెక్టారు క్యాంప్‌లో ఉన్నాను. మబ్బుల్లోంచి

తొంగి చూస్తున్న లేత సూర్యకిరణాలు మా గుడారమ్మీద దాగుడుమూతలాడు కుంటున్నాయి. రోజూ నువు నా మనఃఫలకమ్మీద కనబడి చిరునవ్వులు చిందిస్తున్నావు. నీ మొహమ్మీద ఝాన్సీ రాణి, రుద్రమదేవి నీడలు స్ఫురిస్తున్నాయి. ఎంతకైనా తెగించి శత్రువుల దురాక్రమణలో నున్న టైగర్ హిల్ స్థావరాన్ని తిరిగి కైవసం చేసుకుంటాము. ఐదువేల మీటర్ల ఎత్తు మీదున్న ఈ హిమశిఖరాన్ని వదులుకోము. ప్రాణాలు ఫణంగా పెట్టి సాధిస్తాము.

నీ మాటలు నాకిక్కడ ఆక్సిజన్‌లా పంజేస్తున్నాయి. మనము తల్లిదండ్రులము కాబోతున్నామనే తియ్యని కబురందించిన నీ ఉత్తరం గిలిగింతలు పెట్టింది. సరికొత్త అనుభూతికి లోనయాను. నువు కలలు గన్న వీర కుమారునికి జన్మనిస్తావు. మన జన్మ సార్థకమవుతుంది.

యుద్ధములో ప్రత్యక్షముగా పాల్గొనడం నాకిది మొదటిసారి. టైగర్‌హిల్‌తో పాటు టోలోలింగ్ రేంజిని గూడా మన ఆధీనంలోకి తేవాలని పట్టుదలగా ఉంది. శత్రువుల ఫిరంగుల గర్జనలు కవ్విస్తున్నాయి. ఇప్పటికే హంప్ పర్వతాన్ని, 4590 స్థావరాన్ని వశపరచుకుని 5140 పాయింట్ శిఖరంపై త్రివర్ణ పతాకాన్ని ఎగరేశాము. ఈ ఉత్తరం నీ సున్నిత హస్తాల్లో కొచ్చేలోగా విజయమో, వీరస్వర్గమో తేలిపోతుంది. విజయసాధనలో ఊపిరి ఉంటే రెక్కలు కట్టుకుని ఎగిరొచ్చి నీ ముందు వాల్తాను. లేదా వీరస్వర్గములో అమరేంద్రుని ఆతిథ్యం స్వీకరిస్తూ పై నుండే మిమ్మల్ని చూస్తుంటాను. మీరెంత ఆనందంగా ఉంటే నేనంత సంతోషిస్తాను. దేనికైనా తట్టుకునే ధైర్యం నీకుందనినాకు తెలుసు. నాదో కోరిక.....

నాకిక్కడ అలకానంద అనే అమ్మాయితో పరిచయమైంది. మా మధ్య అనుబంధం పెనవేసుకుంది. ఆమె అందాల బొమ్మయే కాని నిరుపేద. నా ఆదాయం.... అంటే పెన్షన్‌నుండైనా సరే ఆమెకు నెలకు కొంత డబ్బు అందాలి. పండగలకు కొత్త గుడ్డలందాలి. అడ్రసు ఇస్తున్నానిందులోనే. మళ్లీ ఉత్తరం రాయడం కుదురుకుందో లేదో నా దోస్త్ సిపాయి నా పక్కనే గొణుగుతున్నాడు. ఆవో హసన్ ముసాఫిర్, రస్తా బరఫ్‌కీహై పర్ మంజిల్ దూర్ నహీ.... ఆతే రహెూ... (చిరునవ్వుల బాటసారీ! తోవ మంచుమయమైంది. అయినా గమ్యం దూరం లేదు. వస్తూనే ఉండు).

అమ్మా నాన్నలకు పాదాభివందనాలు... ఉంటాను... నీ... మురళి" మయూరమై నర్తిస్తున్న రాధ మనోగతం ఉత్తరాన్ని మరీ మరీ చదివేస్తూ సరిగమలాడుతోంది.

"మురళి రాశాడామ్మా?" పూజాగదిలోంచి వస్తున్న మోహన్రావుగాడు కోడల్ని. వచ్చి ఎదురు సోఫాలో కూచున్నాడు.

"అవును మావయ్యా. ఇదిగో చదవండీ" అందించింది.

"ముందీ చాయ్ కానిద్దాం" పెదాల మీద చిరునవ్వులు, చేతుల్లో చాయ్ కప్పుల ట్రేతో వచ్చి భర్త పక్కన కూచుంది లలితమ్మ. చెరో కప్పు అందించి "ఉత్తరం పైకి చదవండి. నేను గూడా వింటాను..." అంటూ కప్పు పెదాలకానించుకొంది. లోపలి అలజడిని అక్కడే అదిమిపెట్టి "ముందు గరం చాయ్ తాగండి అత్తయ్యా!" అంది రాధ.

టి.వి. వార్తలు చూస్తూ వేడి చాయ్ సిప్ చేస్తుంటే ఉత్సాహం ఉరకలేస్తోంది. ఉత్తరమంతా విన్న లలితమ్మ "యుద్ధం జోరు మీదుంది. వాడెట్లున్నాడో ఏమోనండీ" మొహాన్ని నీలినీడలు కమ్ముకున్నాయి.

గుండె గూటిలో పుత్రవాత్సల్యం పదనిసలు పలుకుతూంటే మోహన్రావు గంభీరవదనుడయాడు. "ఏమవుతుందీ? పాక్ ఎత్తుల్ని చిత్తుచేసి మన దేశానికి విజయం సాధించ పెడ్తారు" ఉత్తరాన్ని టీసాగ్ కప్పగించాడు.

"ఆ అలకానంద ఎవరో... ఆ అనుబంధ మెలాంటిదో..." రాధ మాటలు పూర్తి కాలేదు. లాండ్ ఫోన్ మోగింది. మోహన్రావు అందుకున్నాడు.

"హలో... జీహా! మురళి మేరా బేటా హై" (మురళి నా కొడుకు).

"నేను తెలుగువాణ్ణేనండీ, మిల్ట్రీ హెడ్ క్వాటర్స్ నుండి మాట్లాడ్తున్నాను. మీ మురళి గారు యుద్ధములో వీరమరణం చెందాడండీ. శవాన్ని మీ ఇంటికి తెస్తున్నాం. మీ జిల్లా కలెక్టర్కు సమాచారమందించాము..."

గుండెల్లో అణుబాంబు పేలింది. "హా.... మురళీ! కొ..డు..కా" మోహన్రావు గుండెలు బాదుకున్నాడు. "మన మురళి చనిపోయాడట..." సోఫాలో కుప్పకూలాడు. క్షణాల్లో ఇల్లు దుఃఖ సముద్రమైంది.

కీలకమైన టైగర్ హిల్ భారత్ స్వాధీనంలోకి రావడముతో యుద్ధము కీలకమలుపు తిరిగింది. మురళి అక్కడి నుండే వీరస్వర్గానికెళ్లాడు. టోలోలింగ్ సహా శత్రువుల అక్రమ స్వాధీనంలోని ప్రాంతాలన్నీ తిరిగి భారత్వశమై పోయినై. పాక్ సైనికులు వేలల్లో భారత సైనికులు వందల్లో ప్రాణాలర్పించారు. ప్రతి భారతీయుడి ఎదలో విజయపతాకం రెపరెపలాడింది. దేశమంతా విజయోత్సవాలు జరిగాయి. దేశరక్షా యజ్ఞములో సమిధలైన భారత జవానులకు జాతి నివాళులర్పిస్తూ యథోచిత సత్కారమందించింది.

వీరాభిమన్యుడిలా శత్రుసేనల మీద విరుచుకుపడి విజయానికి కారకుడైన మురళిని మరణానంతరము శౌర్య చక్రపురస్కారం వరించింది. రాధ అత్తామామలతో కలిసి

ఢిల్లీకెళ్లింది. శౌర్యచక్ర పురస్కారం భర్త తరఫున అందుకుంటూంటే హృదయకేదారములో గర్వాన్ని రంగరించుకున్న బాధా మయమైన ఆనంద తరంగాలు ఎగసిపడ్డాయి. ప్రతి తరంగములో మురళి మోహన రూపం చిరునవ్వులతో ప్రత్యక్షమైంది. విజయదరహాసముతో గర్వంగా తన స్పందన తెలియజేసింది. లలితమ్మ - మోహన్రావు అంతరాళాల్లో అష్టమ సముద్రం పొంగులెత్తింది. ప్రముఖుల ప్రశంసలు ఆనందనందన వనములో విహరింప జేశాయి. గ్రాట్యుటీ, పి.ఎఫ్. అన్నీ మంజూరై చేతికొచ్చినై.

నెలనెలా అలకానంద అడ్రసుకు మనియార్డరు వెళ్తోంది. పండగలకు కొత్త గుడ్డలు పార్సిల్లో పంపిస్తున్నారు. మోహన్రావు దంపతులు కుదట పడ్తున్నారు.

రాధకు పుత్రోదయమైంది. మనవడి బోసినవ్వుల్లో కొడుకును చూసుకుంటున్నారు. హృదయ పరితాపానికి కళ్ళెం పడుతోంది. ఆ ఇల్లు ఊరివారికో దేవాలయంలా కనబడుతోంది. మురళిని ఆదర్శంగా భావించి ఆ ఊరి యువకులు కొందరు సైన్యంలో చేరారు. భార్యతో సంప్రదించి ఓ నిర్ణయానికొచ్చాడు మోహన్రావు. మనవడిని ముద్దాడుతూ "అమ్మా రాధా! నువు మా కూతురులాంటి దానివి. వయసులో ఉన్నావు. మా మనవడి బాధ్యతను మాకప్పగించి నువు మళ్ళీ పెళ్ళి..." గొంతు గద్గదమైంది.

"మావయ్యా!" దెబ్బతిన్న పులిలాగైంది రాధ. లలితమ్మ ముందుకొచ్చి "మేము సంతోషంగా ఆశీర్వదిస్తామమ్మా!" భుజాలు పట్టి కూచోబెట్టింది.

"అత్తయ్యా!" శ్రావణమేఘాలైన కళ్ళను కొనకొంగుతో అదుకున్న రాధ వాలకం గంభీరమైంది. "నేను వీరజవాను కెప్టెన్ మురళి అర్ధాంగిని వీరపత్నినయానని పొంగిపోతున్నాను. మీలాగా వీరమాతను కావాలనేది నా ఆశయం. సాంసారిక సుఖాలు శాశ్వత విలువలు కావుగదా! మీరే మా అమ్మా నాన్నా లనుకొంటున్నాను. మాధవ్ను బాగా చదివించి, మీ మనవడని గర్వంగా చెప్పుకునేలా వీరజవానుగా తీర్చిదిద్దాలనేదే నా ఆశయం. అదే నా ఊపిరి. దయచేసి అలాంటి ప్రసక్తి మరోసారి తేవద్దు. మీ అబ్బాయితో గడిపిన మధుర క్షణాలను జీవితాంతం నెమరేసుకుంటాను. ఆనాటి రాధలా మురళీమోహన రూపాన్ని గుండెల్లో దాచుకుని ఆరాధిస్తున్నాను" ఉద్వేగాన్ని ఊపిరితో మేళవించి చేతులు జోడించింది.

+

కాలచక్రం గిరగిరల్లో ఓ దశాబ్దం కరిగిపోయింది.

భారతజాతి కార్గిల్ విజయానికి గుర్తుగా దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోంది. భావితరాల స్ఫూర్తి కోసం పదేళ్ళ క్రితం సాధించిన ఘన విజయాన్ని నెమరేసుకుంటోంది.

దేశసైనిక శిబిరాల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. అన్నింటిని అవలోకిస్తున్న మోహన్రావు మస్తిష్కంలో ఓ అనుమానం పురుగు ప్రవేశించింది. భార్యను, కోడల్ను ముందు కూచోబెట్టుకున్నాడు.

"అమ్మా రాధా! మనం ప్రతి నెలా కాశ్మీర్లో ఉన్న... ఆ అలకానందకు డబ్బు పంపిస్తున్నాం గదా! ఇంతకూ ఆ అమ్మాయెవరో... ఆ డబ్బు ఎట్లా ఖర్చవుతోందో ఏమో!" ప్రస్తావించాడు.

"అవునండీ, ఆ డబ్బులు ఆ అమ్మాయికే ముడుతున్నాయో లేదో! అయినా ... ఇట్లా ఎన్నాళ్ళు పంపిద్దాము?" లలితమ్మ సందేహం.

"అవును మావయ్యా! మనమోసారి వెళ్ళి చూస్తే తృప్తిగా ఉంటుంది గదా! నేను ఉద్యోగానికి లీవు పెడ్తాను" ఆసక్తిగా బలపరిచింది రాధ.

"నేను గూడా వస్తా తాతయ్యా!" చిన్నారి మాధవ్ తాతయ్య ఒడిలో చేరాడు.

అందరి ఆసక్తి వారం రోజుల్లో బయలుదేర దీసింది.

కుప్వారాలో దిగి ఊపిరి పీల్చుకున్నారు. అడ్రసు కాయితం చేతిలో పట్టుకుని అలకానంద ఇల్లు కనుక్కోవడం సుసాధ్యమైంది.

చుట్టూ రంగురంగుల పూలమొక్కలు. మధ్యన చిన్న పాకలాగుంది ఇల్లు. ముందు కర్రగేటు ఉంది. ఆరబోసిన ప్రకృతి అందాలు ఎదల్లో గిలిగింతలు పెడుతున్నాయి. లలితమ్మకు నమ్మకం కుదరలేదు. "ఇది ఇల్లేనా" అడిగింది భర్తను.

"ఇక్కడ సామాన్యుల ఇండ్లు ఇట్లానే ఉంటాయట" కుప్పలుగా పోసిన వెన్న ముద్దల్లాంటి మంచుకొండల అందాలను ఆస్వాదిస్తూ మోహన్రావు చేతిలో ఉన్న సూటుకేసును నేలమీదుంచాడు. మంచుకొండల్ని నీలిమేఘాలు అలుము కుంటున్నాయి. కొండలమీంచి జాలువారుతున్న జలపాత నవ్వడిని వింటూంటే మనసులు మూగవోతున్నాయి.

రాధ ముందుకొచ్చి "ఇట్లా ఎంతసేపు నిల్చుందాం? పదండి లోపలికి" అంటూ గేటు తీసింది. ఉన్ని దుస్తులు వేసుకున్నా చలి తన ప్రతాపం చూపిస్తూనే ఉంది. మాధవ్ నానమ్మ వేలు పట్టుకున్నాడు. లోపలిదాకా నడిచారు. సగం వేసున్న తలుపు మీద మునివేళ్ళతో టకటకలాడించాడు మోహన్రావు.

"ఆ... ఆ..." లోపలి నుండి తియ్యని గొంతు.

"హమ్ హైద్రాబాద్సే ఆయే" (మేము హైద్రాబాదు నుండి వచ్చాము).

ఓపికకు పరీక్షలా తలుపులు మంద్రస్వరంతో మెల్లగా తెరుచుకున్నాయి. సెట్ -

సెల్వార్ కమీజు, ఎత్తైన గుండెల మీద జారుతున్న చున్నీ, కాశ్మీరీ దుస్తుల్లో... నిర్మలాకాశములో చందమామలాగుందా యువతి. మొహం ఆపిల్‌పండులాగుంది.

"మీకు హిందీ వచ్చా?" హిందీలో అడిగాడు మోహన్రావు.

వచ్చునన్నట్టుగా తలూపింది. లోపలికాహ్వానించింది. తన పేరు చెప్పుకుని అందరినీ ఆశ్చర్యంగా చూసింది. వచ్చినవారి దృష్టి ఇంటిగోడల మీదుంది. చిన్న గది. ఓ పక్కన మంచము, మరో పక్క రెండు కుర్చీలు, ఓ టీపాయ్. ఇంకో పక్కన నిప్పుల కుంపటి. చలిబారి నుండి నేను రక్షిస్తానంటోంది. షెల్ఫ్‌లో కొలువు దీరిన రేడియో కార్గిల్ విజయోత్సవ కార్యక్రమాలను ప్రసారం చేస్తోంది. షెల్ఫు పక్కన ఇంకో గది తలుపులున్నాయి. బహుశా అది వంటగది కావచ్చు. షెల్ఫు మధ్యన, రేడియో పక్కన ఫ్రేములో బిగించిన మురళి ఫోటో... మిల్ట్రీ డ్రెస్సులో... తండ్రిని ఫోటోలో మాత్రమే చూచి గుర్తుంచుకున్న మాధవ్ ఫోటో వద్దకెళ్ళి

"ఇది మా నాన్న ఫోటో కదూ!" అంటూ దండంబెట్టి కుర్చీలో కూచున్నాడు. అలకానంద కదో గమ్మత్తులా గన్పించింది. తాను మరో కుర్చీలో కూచుని వాళ్ళకు మంచం చూపించింది. అప్పటికే ఆ ముగ్గురి కళ్ళల్లో కరిగిన మురళి రూపం పొత్తికడుపుల్లో తిరగుతోంది. రాధ బాధ ఎసరులా పొంగుకొచ్చి గొంతులో బందీ అయింది.

సంభాషణ హిందీలో సాగింది.

"మీరు..." అలకానంద చూపుడువేలు చెక్కిలి మీదుంది.

"నా పేరు మోహన్రావు. మురళి తండ్రిని..." అందరినీ పరిచయం చేశాడు. అలకానంద ముఖపద్మము వందల రేకులుగా విచ్చుకుంది. కళ్ళు అరచేతులంతైనాయి. వెంటనే లేచింది. వాళ్ళను మంచమ్మీద కూచోబెట్టింది. ఫ్లాస్కులోంచి చాయ్ గ్లాసుల్లోకి వంచి అందించింది. "ఇప్పుడు నాకెంతో సంతోషంగా ఉంది. మీ మనియార్డరు ప్రతినెలా అందుతుంది" హుషారుగా చెబుతోంది. "మీ కొడుకు... మిల్ట్రీ ఆఫీసర్ నాకెంతో సాయం చేశాడు" మురళి ఫోటోకు నమస్కరించింది.

"నీకు పెళ్ళయిందామ్మా!" మెదడు పొరల్ని తొలుస్తున్న ప్రశ్న, బాణాన్నొదిలి పెట్టింది లలితమ్మ.

"లేదు" బుగ్గలు సిగ్గులు సింగారించుకున్నాయి.

రాధలో తియ్యని బాధ.

"మీ అమ్మా నాన్న లెవరూ? మా మురళితో పరిచయమెలాగైంది?" వ్యాపారములో ఆరితేరిన మోహన్రావు నెమ్మదిగా అడిగాడు.

కొత్త పెళ్ళికూతురులా సిగ్గుల మొగ్గలు రాల్చుతూ మళ్ళీ కుర్చీలో కూచుంది. "నా పేరు అలకానంద అని చెప్పాను గదా! మా అమ్మానాన్నల్ని జిహాదీలు చంపేశారు. అమ్మమ్మ తాతయ్యల వద్ద ఇక్కడే ఉండేదాన్ని. గత సంవత్సరం నన్ను ఒంటరిగా వదిలేసి ఇద్దరూ చనిపోయారు.

అప్పుడు నా వయసు పదేళ్ళు. ఇక్కడే పాకిస్తాన్‌తో యుద్ధం జరిగింది. ఓ మిల్ట్రీ ఆఫీసర్... మురళి హైదరాబాదు వారట. మా ఇంటి ముందు నుండి రోజూ వెళ్ళేవారు. ఓ రోజు ఈ ఇంటిముందే నన్ను చూశారు. ముద్దొస్తున్నావంటూ రెండు ఆపిల్ పండ్లిచ్చారు. దగ్గరకు తీసుకుని నా వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. నేనప్పుడు చదువుకుంటున్నా. రోజూ ఏదో ఒకటి నా కోసం తెచ్చి ఇచ్చేవాడు. ఓ రోజు అతని ఫోటో... అదో అక్కడుంది. అదే అడిగి తీసుకున్నాను. యుద్ధం తర్వాత మళ్ళీ కనబడలేదు. హైద్రాబాదుకొచ్చాడు గదూ! అతని సాయం వల్లనే నా చదువు సాగింది. ఆ చదువే నాలో ఆత్మవిశ్వాసం నింపింది. ఇప్పుడో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం దొరికింది. ఆ మురళీమోహనుణ్ని నా గుండెగూటిలో ప్రతిష్ఠించుకుని ఆరాధిస్తున్నాను. ఎప్పుడో ఒకప్పుడు తప్పక నాకోసమొస్తాడనుకుంటున్నాను. కాని... ఇంకా రాలేదు. నేనే అతణ్ని కలుసుకునేందు కోసారి హైద్రాబాదు రావాలనుకుంటున్నాను..." చెప్పుకు పోతూంటే చెంపల మీది సొట్టల మీద ముంగురులు ఆడుకుంటున్నాయి.

రాధ ఎద సముద్రములో సునామీ పొంగులు జీవం పోసుకుంటున్నాయి. కళ్ళను కమ్ముకుంటున్న మంచుపొరల్ని కొనకొంగుతో అద్దుకుంటూ "అతడెందుకొస్తాడు?" అడిగింది.

"అతడు లేకుండా నాకు పెళ్ళవుతుందా?" ఎదురు ప్రశ్న. అలకానంద కళ్ళల్లో ఆశాకెరటాలున్నాయి.

"మా కొడుకు మురళి అప్పటి యుద్ధంలో ఇక్కడే చనిపోయాడమ్మా!" మోహన్రావు గొంతు పూడుకుపోతోంది.

అలకానంద హృదయకేదారము అల్లకల్లోలమైంది. లేచి పరుగెత్తికెళ్ళి "హాయ్... మురళీ భయ్యా... మేరే మాసూమ్ భయ్యా" గోడుగోడుమంటూ మురళి ఫోటోను గుండెలకు హత్తుకుంది.

కార్గిల్ విజయోత్సవ శతాబ్దిలో భాగంగా రేడియో కార్యక్రమంలో గాన కోకిల లతామంగేష్కర్ గొంతు శ్రావ్యంగా వినబడుతోంది.

"ఓ మేరె వతన్‌కే లోగో
జర ఆంఖ్‌మె భర్‌లో పానీ
జో షహీద్ హువేహై ఉన్‌కీ
జర యాద్ కరో కురుబానీ..."

(ఓ నా దేశ ప్రజలారా! కళ్ళల్లో కాస్త నీళ్ళు నింపుకోండి. వీరమరణం చెందిన వారి త్యాగాలను గుర్తు చేసుకోండి).

(చేతన్,మే 2010)